సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోరు
చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు చేశాయి. ఆదివారం రెండవ రోజు కేఎస్ఆర్ ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు–కడప జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. -8లో



జీవితాన్ని చదివేద్దాం.. బతికి సాధిద్దాం
యువత వివిధ కారణాలతో క్షణికావేశంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. విద్యార్థులు జీవితాన్ని చదవాలి.. బతికి సాధించాలి. -8లో


గరిష్టం/కనిష్టం
33.6/26.6

వాతావరణం
జిల్లాలో ఆదివారం 26.6 – 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలునమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

కళ్లముందే దైన్యం..
కూటమి దుర్మార్గం



ఈమె పేరు గజ్జల జ్యోతి. గండిరోడ్డు వేంపల్లె నివాసి. పుట్టుకతో దివ్యాంగురాలు. రూ.75 వికలాంగుల పెన్షన్ ఉన్నప్పటి నుంచి పొందుతోంది. 22ఏళ్లుగా పెన్షన్ ఆమె జీవనానికి భరోసాగా నిలుస్తోంది. ఇటీవల అమెకు ప్రభుత్వం నోటీసు జారీ చేయడంతో వెరిఫికేషన్‌కు వెళ్లారు. 95శాతం వైకల్యం ఉన్న సర్టిఫికెట్ స్థానంలో తాజాగా 80శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించారు. సదరం సర్టిఫికెట్లు జారీ చేసే సందర్భంగా రూ.30వేలు లంచం అడిగితే నావద్ద లేదు, ఇచ్చుకోలేనని వెల్లడించింది. వెరశి 80 శాతానికి తగ్గించడం వల్ల రూ.6వేలు పెన్షన్‌కు పరిమితమైంది.



ఎన్నికల హామీ ఉష్‌కాకీ...

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. కొత్తగా పెన్షన్లు ఇవ్వకపోగా, ఉన్నవాటికి ఎలా కోత పెట్టాలనే దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారని పలువురు వెల్లడిస్తున్నారు. 95శాతం ఉన్నట్లు సర్టిఫికెట్లతో పెన్షన్ తీసుకుంటున్న వారికి తాజాగా తక్కువ శాతం వికలత్వం ఉన్నట్లు సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. ముందుగా సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులన్నా ..లేదా తాజా సర్టిఫికెట్లు జారీ చేస్తున్న యంత్రాంగమైన తప్పు చేసి ఉండాలి. ఈ దిశగా ప్రభుత్వ చర్యలు లేకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. కేవలం వికలత్వ పెన్షలు తగ్గించాలనే దిశగా వేసిన ఎత్తుగడ కారణంగానే అనేక మంది కోల్పోవాల్సి వస్తోందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

దివ్యాంగులపై సర్కార్ కత్తి
- జిల్లా వ్యాప్తంగా 7,182 మందికి నోటీసులు
- అప్పీళ్లకు వెళితే ముప్పతిప్పలు పెడుతున్న వైద్యయంత్రాంగం
- చేతులు తడపకపోతే వైకల్యశాతాన్ని తగ్గిస్తున్నారని ఆవేదన
- నేడు ఫించన్లు పంపిణీ కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, కడప: దివ్యాంగ పింఛన్లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా నిజమైన అర్హులకు అన్యాయం చేస్తూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. రీ–వెరిఫికేషన్‌లో సదరం సర్టిఫికెట్లు తీసుకునేందుకు వెళ్లిన దివ్యాంగులను ముప్పతిప్పలు పెడుతున్నారు. చేతులు తడిపిన వారికి మాత్రమే తప్పుడు ధ్రువీకరణ ఇస్తూ, నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారు. తాళ్లప్రొద్దుటూరు కేంద్రంగా దివ్యాంగుల రీ–వెరిఫికేషన్‌లో జారీ చేసిన సర్టిఫికెట్లు తనిఖీలు చేస్తే ఆ విషయం తేటతెల్లం కానుంది. ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా 7,182 మందికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది.

కోతలు పెట్టేందుకు కుయుక్తులు

దివ్యాంగుల పింఛన్‌లో కోతలు పెట్టేందుకు ప్రభుత్వ కుయుక్తులు పన్నిందని పలువురు వాపోతున్నారు. అందుకు క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న ఉదంతాలు దర్పంగా నిలుస్తున్నాయి. వైకల్యం ఉన్న శాతాన్ని తక్కువ చూపించి పింఛన్లు తొలగించారని కొందరు వాపోతుంటే, తక్కువ శాతం వికలత్వం ఉన్నట్లు చూపి మొత్తం తగ్గిస్తున్నారని మరికొందరు మండిపడుతున్నారు. ఇరువై ఏళ్ల కాలం నుంచి పింఛన్ తీసుకుంటున్న వారికి సైతం రీ–వెరిఫికేషన్ పేరిట తొలగిస్తున్నారు. పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉన్నఫలంగా పింఛన్ తొలగించడంతో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు దివ్యాంగులు వాపోతున్నారు.

» ఫించన్ల పంపిణీకి సీఎం రాక

ప్రతి నెలా 1వ తేదీన ఏదో ఒక జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన ఉంటోంది. పెన్షన్ పంపిణీ పేరిట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆమేరకు అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని పెద్దకారంపల్లెలో పింఛనుదారులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వాస్తవానికి అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇస్తామని పేరుకు చెబుతుండడం మినహా ఉన్న వాటిని ఎలా తగ్గించాలనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆమేరకు జిల్లాలో 7,182 దివ్యాంగుల పెన్షన్లకు కోత పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని పలువురు వివరిస్తున్నారు.

పార్వతీ తనయా.. పాహిమాం



కడప రాజీవ్‌పార్కు నుంచి భక్తజన సందోహం మధ్య నిమజ్జనానికి తరలిన భారీ వినాయక విగ్రహం



రాజీవ్‌మార్గ్ వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

మేళతాళాలు...డప్పు వాయిద్యాలు...బాణాసంచా పేలుళ్లు, యువత కేరింతలు, మిన్నంటిన భక్తజన కోలాహలం నడుమ ఐదవరోజైన ఆదివారం కడప నగరంతోపాటు జిల్లా అంతటా గణేష్ నిమజ్జన వేడుకలు నేత్ర పర్వంగా సాగాయి. చతుర్థి నుంచి భక్తుల పూజా నైవేద్యాలు అందుకున్న గణపతి వచ్చే ఏడాది మళ్లీ కలుద్దామంటూ గంగ ఒడికి తరలి వెళ్లారు. నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.కడపలోని రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని, అలాంటి పర్వదినాల్లో ముఖ్యమైనది వినాయక చవితి అని ఆయన అన్నారు. నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది. దీంతో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.

-కడప సెవెన్‌రోడ్స్



వినాయక నిమజ్జన ఉత్సవంలో చిన్నారుల కోలాటం



దేవునికడప చెరువులో గంగమ్మఒడికి చేరుతున్న గణపతి

న్యూస్‌రీల్

శ్రీరంగనాథా..నమోస్తుతే



శేష వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటిలోని అతి పురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శ్రీరంగనాథుడు శేష వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కృష్ణరాజేశ్వర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నూలుపూజ పవిత్రోత్సవాలు 9రోజులు జరగనున్నాయి. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు పాల్గొన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమం జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో జరుగుతుందన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562– 244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. అర్జీదారులు తమ అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

నేటి నుంచి వైఎస్ జగన్ పులివెందుల పర్యటన

2న ఇడుపులపాయలో తండ్రి వైఎస్సార్ సమాధి వద్ద నివాళి, ప్రత్యేక ప్రార్థనలు



పులివెందుల: మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నుంచి మూడు రోజులపాటు పులివెందులలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన వివరాలను పార్టీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 1వ తేదీన మధ్యాహ్నం 1.30గంటలకు బెంగళూరులోని తన నివాసం నుంచి బయలుదేరి జక్కూరు ఎయిర్‌డ్రోంకు 1.50గంటలకు చేరుకుంటారు. 2గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 2,.50గంటలకు పులివెందులలోని స్థానిక భాకరాపురంలో ఉన్న హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 2.55గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3.గంటలకు పులివెందులలోని తన క్యాంపు ఆఫీస్‌కు చేరుకుంటారు. 3 నుంచి రాత్రి 7.30 వరకు క్యాంపు ఆఫీస్‌లో ప్రజలతో మమేకం కానున్నారు. 7.30కి క్యాంపు ఆఫీస్ నుంచి బయలుదేరి 7.35కు తన నివాసానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. సెప్టెంబర్ 2న వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఉదయం 6.45గంటలకు పులివెందులలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన నేరుగా ఇడుపులపాయకు బయలుదేరతారు. 7.15గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు. ఉదయం 7.15గంటల నుంచి 8గంటల వరకు వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రి వైఎస్సార్‌కు నివాళులర్పించడంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. 8గంటలకు ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్ నుంచి రోడ్డు మార్గాన లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి బయలుదేరుతారు. 10.30గంటలకు అంబకపల్లెకు చేరుకుంటారు. 10.30 నుంచి 11.30 వరకు అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ కుంట చెరువు వద్ద నీటికి జలహారతి ఇవ్వనున్నారు. 11.30కి అంబకపల్లె గ్రామం నుంచి బయలుదేరి 12.30కి పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారు. 2.25కు తన నివాసం నుంచి బయలుదేరి 2.30కి భాకరాపురంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. 2.30 నుంచి 7.25 వరకు తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో ఆయన మమేకం కానున్నారు. 7.30కి భాకరాపురంలోని తన నివాసానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే ఆయన బస చేయనున్నారు. సెప్టెంబర్ 3న ఉదయం 7గంటలకు భాకరాపురంలోని తన నివాసం నుంచి బయలుదేరి 7.05గంటలకు అదే ప్రాంతంలో ఉన్న హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 7.15కు హెలీక్టాపర్ ద్వారా బెంగుళూరుకు బయలుదేరుతారు. 8.30గంటలకు యలహంకలో ఉన్న తన నివాసానికి చేరుకుంటారు.

ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతర పోరాటం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున నిరంతర పోరాటాలు చేస్తుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. పెట్టుబడికి ప్రభుత్వ సాయం అందడంలేదని, విత్తనాలు రావడంలేదని, అష్టకష్టాలు పడి పంటలు సాగు చేస్తుంటే యూరియా అందడంలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లభించడంలేదన్నారు. యూరియాను టీడీపీ నాయకులు పక్కదారి పట్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదన్నారు. ఎరువులు వ్యాపారులకే సరఫరా చేస్తుండటంతో రైతు సేవా కేంద్రాల్లో దొరకక రైతన్నలు అవస్థలు పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు రైతులకు అందేవన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై చేస్తున్న కక్ష సాధింపు చర్యల్లో కనీసం 10శాతం శ్రద్ధ చూపినా రాష్ట్రంలోని రైతులు, ఇతర వర్గాల ప్రజలు బాగుపడే అవకాశం ఉంటుందన్నారు.టీడీపీ వారి ఆరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వారికి తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

శరణు కోరే వారికి అభయమిచ్చే ఆరోగ్యమాత





విశేష అలంకారంలో ఆరోగ్యమాత, సందేశం అందజేస్తున్న పోరుమామిళ్ల విచారణ గురువులు జాలా విజయభాస్కర్

కడప సెవెన్‌రోడ్స్: తనకు జన్మనిచ్చేందుకు లోక రక్షకుడైన దేవుడు నిన్ను ఎన్నుకున్నాడని పవిత్రమైన మాతగా శరణుకోరిన వారికి అభయమిచ్చే ఆరోగ్యమాతగా భక్తులు ఆరాధిస్తున్నారని పోరుమామిళ్ల విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జాలా విజయభాస్కర్ అన్నారు. ఆదివారం ఆరోగ్యమాత ఉత్సవాలు మూడో రోజు సాయంత్రం ఆరోగ్య రాజ్ దివ్యబలి పూజను సమర్పించారు. దేశ దేశ, రాష్ట్ర, ప్రజల శాంతి సమాధానాల కోసం ఆయన ప్రార్థించారు. దేవమాత ద్వారా ప్రజల కోర్కెలను ప్రభువు తీర్చాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఆయన విశ్వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇక్కడి క్షేత్రంలో వెలిసిన దేవమాత ద్వారా ఎన్నో అద్భుతాలు జరుగుతున్నాయని వివరించారు. మరియ తల్లి పట్ల భక్తి, విధేయత అందరూ అలవర్చుకోవాలని కోరారు. దేవుని వాక్కులు ఆలపించాలని సూచించారు. మంచి సుగుణాలను దేవుని కృపద్వారా సిద్ధించాలని, అందుకు కావాల్సిన శక్తి తల్లి ద్వారా సమకూరాలని ప్రార్థించారు. అంతకు ముందు మరియ తల్లి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ఊరేగించారు. పాటలు, మరియతల్లి తేరు, దివ్య బలిపీఠం అలంకరించారు. ఈ కార్యక్రమంలో మోస్ట్ సిగ్నోర్ రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, రెవరెండ్ ఫాదర్ విజయరావు, జోసెఫ్‌రాజుతోపాటు డయాసిస్ గురువులు, కన్యస్త్రీలు, భక్తులుపాల్గొన్నారు.

రూ.4,20,999 పలికిన లడ్డూ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక సాయిరాజేశ్వరి కాలనీలోని సాయిరాజేశ్వరి గణపతి ఉత్సవ కమిటీ వారు గణపతి వద్ద ఉంచి పూజ చేసిన లడ్డూ, వెండి కలశం, నోట్ల దండ, వెండి కాయిన్‌లకు వేలం వేశారు. శ్రీ సాయిక్రేన్స్ అధినేత వల్లపు రెడ్డి వరద కుమార్‌రెడ్డి వెండి ప్లేట్ కలిగిన లడ్డూను రూ.4,20,999లకు, వెండి కలశాన్ని రూ.3,36,000లకు వేలంలో దక్కించుకున్నారు. రూ.200 నోట్ల దండను సి.వెంకటగోపాల్ రెడ్డి రూ.1,27,999లకు, వెండి కాయిన్‌ను దొంతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి రూ.1,21,999లకు చేజిక్కించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ వారు సత్కరించారు.



లడ్డూ, వెండి కలశాన్ని వేలంలో దక్కించుకున్న వరదకుమార్‌రెడ్డి

ఇది మహిళా వ్యతిరేక ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ధ్వజం

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో మహిళా వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ధ్వజమెత్తారు. ఆదివారం ఇక్కడి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో మహిళలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడిచినా ఏ పథకాన్ని సరిగ్గా అమలు చేయలేదన్నారు. 19–59 ఏళ్లలోపు మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని దాని ఊసే ఎత్తడం లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని 11 రకాల సర్వీసుల్లో ఐదింటిలో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నారన్నారు. 20లక్షల ఉద్యోగాలిస్తామని, నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చేసిన మొదటి సంతకానికి దిక్కు లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని, మొదటి ఏడాది ఎగ్గొట్టారని, రెండో ఏడాది రూ.7వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, ఉన్న పింఛన్లు తీసేశారన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, మొదటి ఏడాది ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చారన్నారు. అమ్మ ఒడి పథకాన్ని కాపీ కొట్టి అమలు చేసిన తల్లికి వందనం పథకం కూడా మొదటి ఏడాది ఇవ్వలేదన్నారు. ఇలా అన్ని పథకాలకు తూట్లు పొడుస్తూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఏ మొఖం పెట్టుకొని చెప్పుకుంటారని ప్రశ్నించారు. మహిళల రక్షణ, భద్రత పూర్తిగా గాలికొదిలేశారన్నారు. మహిళలపై చేయి వేస్తే అదే చివరి రోజవుతుందని ఎన్నికల్లో చెప్పారని, టీడీపీ ఎమ్మెల్యేలే మహిళలను వేధిస్తున్నా చివరి రోజు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు 80వేల బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. మంత్రివర్గంలో ముగ్గరు మహిళలున్నా మహిళలపై జరిగే అఘాయిత్యాలపై వారు స్పందించిన పాపాన పోలేదన్నారు. మహిళల జోలికొస్తే తాటతీస్తా, తొక్కతీస్తా అంటూ ఊగిపోయిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు శాంతిభద్రతలు తన పరిధిలోకి రావంటున్నారన్నారు. సుగాలి ప్రీతి కేసును రాజకీయంగా ఉపయోగించుకొని లబ్ధిపొంది, ఆ బాలిక తల్లికి ఇప్పుడు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి సతీమణి అరుణమ్మ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవడానికి మహిళలంతా కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ మనోహరి, జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు బండి దీప్తి, మహిళా నేతలు బి. మరియలు, ఏకుల రాజేశ్వరి, మూలే సరస్వతి, తులశమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి

▶▶ మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతం చేయడానికి మహిళలంతా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లాలోని మహిళా నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాకంటక పాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వానికి మహిళలంతా ఏకమై బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను, మహిళల రక్షణ కోసం కార్యాచరణ ప్రణాళిక రచించడానికి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకుపోయి చైతన్యం చేయాలని, తద్వారా 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ప్రతి మహిళ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఈనెల 2వ తేదీన మంగళవారం ఉదయం 6.30 గంటలకు స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. వైఎస్సార్‌కు ఘనంగా నివాళి అర్పించే కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, కుల సంఘాల, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పులివెందుల ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వైవీయూ స్కాలర్



సారిక

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ పరిశోధక విద్యార్థిని సారిక ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షల్లో ఆంగ్ల విభాగంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో ఓపెన్ కేటగిరీ లో డిస్ట్రిక్ లో 77.83 మార్కులతో పందొమ్మిదవ ర్యాంకు, పీజీటీ ఇంగ్లీష్ లో నాల్గవ జోన్‌లో 16వ ర్యాంకు, టీజీటీలో 4వ జోన్ పరిధిలో 57వ ర్యాంకు పొందారు. కడప నగరం మృత్యుంజయకుంట కాలనీలో నివాసముంటున్న వినయకుమార్, కుమారి దంపతుల ప్రథమ కుమార్తె సారిక. క్రమశిక్షణ, పట్టుదల, సాధించాలనే తపన ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని ఆమె నిరూపించారు.

మంత్రి పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు



పెండ్లిమర్రిలో డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలో ఈనెల 2వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఈ.జీ. అశోక్‌కుమార్‌లు అధికారులకు సూచించారు. మండల కేంద్రానికి సమీపంలో నూతనంగా రూ.12 కోట్ల నిధులతో నిర్మించిన ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఆదివారం వారు పరిశీలించారు. 2వ తేదీన విద్యాశాఖ మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కళాశాల భవనాలను, కళాశాల పరిసరాలను పరిశీలించి కళాశాల ప్రిన్సిపాల్‌తో, అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, తహసీల్దార్ అనురాధ పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం చింతకొమ్మదిన్నె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో అధునాతన వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌ను ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీవితాన్ని చదివేద్దాం.. బతికి సాధిద్దాం

మన తాతలు, తల్లిదండ్రులు అక్షరం ముక్క చదవకపోయినా జీవించారు. రెక్కల కష్టంతోనే ఐదుగురి నుంచి పదిమంది పిల్లలను పెంచి పోషించారు. ఇప్పుడున్న వసతులు, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్పుడు లేవు. ఇప్పుడున్న యువత చదువు అర్థం కాకపోయినా, ఫెయిలైనా, తమకు నచ్చని చదువులు, వివిధ కారణాలతో ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. విద్యార్థులు జీవితాన్ని చదవాలి.. బతికి సాధించాలి.

- చదువులు, తరగతి గదులు, వసతి గృహాల్లో ఇమడలేకపోతున్న విద్యార్థులు
- తల్లిదండ్రులూ ముందు జాగ్రత్తలు తీసుకోండి



ట్రిపుల్ ఐటీ విద్యార్థి నరసింహనాయుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి(ఫైల్)



మృతి చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి నరసింహనాయుడు (ఫైల్)

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంటిగ్రేటెడ్ కోర్సును చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనై వసతి గృహాల్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత ఏడాది ఆగస్టు 8వ తేదీన ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పీయూసీ–2 (ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం) చదువుతున్న జమీషా ఖురేషి అనే విద్యార్థిని క్యాంపస్‌లోని వసతి గృహంలో ఉన్న బాత్రూంలో తన చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శివ కిటికీ అద్దాలను పగులగొట్టి చేతులను గాయపరచుకున్నాడు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని తోటి విద్యార్థితో ప్రేమలో పడి మూడంతస్తుల పై నుంచి దూకి మృతి చెందింది. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఏచ్చర్ల మండలం షేర్ మహమ్మదాపురం గ్రామానికి చెందిన పీయూసీ–2 విద్యార్థి జి. నరసింహనాయుడు ఉరివేసుకుని మృతి చెందాడు. కళాశాలలో రాత్రి పూట చాలాసేపు మేలుకొని చదువుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామని బెంగతో, హాస్టల్‌లో భోజనం సరిగా లేకపోవడంతో, తమకిష్టమైన చదువును చదవలేకనో, జీవితంపై విరక్తి చెంది ఈ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో ఇలాంటి సంఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.

పిల్లలే తమ సర్వస్వమని..

పిల్లలే తమ సర్వస్వమని.. వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. సంపాదనలో అధిక భాగం విద్య కోసమే ఖర్చు పెడుతుంటారు. ఇదే సమయంలో ఇతర కుటుంబాల పిల్లలతో పోలుస్తుంటారు. ఇది మంచిది కాదు. ఇలా చేయడం వల్ల వారిలో ఆత్మన్యూనత భావం పెరుగుతుంది. చదువు పేరుతో నిరంతరం ఒత్తిడికి గురి చేయరాదు. ఉద్యోగం, ఇంటి బాధ్యతలు ఉన్నా పిల్లలతో రోజుకు గంట అయినా ఆప్యాయంగా మాట్లాడాలి. అప్పుడే వారిలో మానసిక పరిపక్వత కలుగుతుంది. నలుగురిలో ధైర్యంగా మాట్లాడగలుగుతారు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకుంటారు. సమాజంలో ఎలా జీవించాలో, నలుగురితో ఎలా నడుచుకోవాలో నేర్చుకుంటారు. ఏదైనా సమస్య వస్తే నేరుగా తల్లిదండ్రులతో చెప్పుకునేలా అవకాశం కల్పించాలని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఒత్తిడి భరించలేకనే..

ప్రస్తుతం అన్ని రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ప్రతి ఒక్కరూ కాలంతోపాటు పరుగులు తీయాల్సి వస్తోంది. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఈ ధోరణి ఎక్కువగానే ఉంది. మంచి మార్కులు, ర్యాంకులు వస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందనే భావనతో అందరూ ఉన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. ఇంట్లో ఉండి పిల్లలు తరగతి గదులు, తమకిష్టమైన చదువులను చదువుకోలేక, వసతి గృహాల్లో ఇమడలేక పోతున్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ సమస్యలు, చిన్న, చిన్న సమస్యలకే తల్లడిల్లిపోతున్నారు. ఒక్కోసారి జీవితంపై విరక్తి చెంది కఠిన నిర్ణయాలు తీసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగుల్చుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

పిల్లలకు భరోసా కల్పించాలి..

గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం తెలుగు మాధ్యమంలో చదువుకుంటున్నారు. ఇంటర్‌లోకి వచ్చేసరికి ఆంగ్ల మాధ్యమం ఎంచుకుంటున్నారు. భవిష్యత్‌లో తెలుగులో కంటే ఇంగ్లీష్ మాధ్యమం చదివిన వారికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అపోహతో ఇంగ్లీషు విద్యనభ్యసిస్తున్నారు. అంతేకాకుండా ట్రిపుల్ ఐటీలలో ఇంగ్లీష్ మాధ్యమంతోపాటు తెలుగు మీడియంలో కూడా బోధన చేస్తుంటారు. అయితే పరీక్షలు మాత్రం ఇంగ్లీష్ మాధ్యమంలోనే రాయాలి. కంప్యూటర్ తదితర వాటిపై మంచి పట్టు ఉండాలి. ఓరియంటల్ తరగతుల్లో మాత్రం మూడు నెలలపాటు శ్రద్ధగా చదివితే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందులు ఉండవని ట్రిపుల్ ఐటీ అధికారులు భరోసా కల్పించాలి. ఒకేసారి భాషాపరమైన ఒత్తిడి, పోటీని తట్టుకుని నిలబడాలనే ఉద్దేశంతో శక్తికి మించి కష్టపడుతూ కుంగుబాటుకు లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. మొదటిసారి ఇంగ్లీష్ మీడియంలోకి వచ్చిన పిల్లలను దృష్టిలో ఉంచుకుని వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యాలపై ఉంది.

వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలి..

చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలి. మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలి. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి. ఉన్నత విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించాలి.

చదువు జీవితంలో ఒక భాగం..



చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. ఇప్పటి ప్రపంచంలో మనం బతకడానికి ఎన్నో ఉపాయాలు, సాధనలు, అవకాశాలు ఉన్నాయి. చదువు రాకపోతే బతకలేమనేది అవాస్తవం. ఆత్మహత్య చేసుకునే ముందు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుని నిండు జీవితాన్ని పాడు చేసుకోవద్దు. విద్యార్థులుగా మీరు ఆలోచించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మానేయాలి. అమ్మ, నాన్న, అధ్యాపకులు కూడా పిల్లలు ఏ రంగంలో రాణిస్తున్నారో గుర్తించి.. అందులో వారిని ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా పెంచుకోవాలి. విద్యార్థుల ప్రవర్తన, కదలికలను అనుక్షణం గమనించాలి. ఇప్పుడున్న యువత క్షణికావేశానికి ఎక్కువగా లోనవుతున్నారు. వారిని ముందే గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తే ఫలితం ఉంటుంది.

– డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఆర్కే వ్యాలీ ప్రభుత్వాసుపత్రి, ఇడుపులపాయ

ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నాం..



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో ప్రవేశం కల్పించిన తర్వాత ఇంగ్లీష్ మీడియం కోర్సుపై పట్టును పెంచేందుకు ఓరియంటేషన్ తరగతులను నిర్వహిస్తున్నాం. ఎక్కువమంది ట్రిపుల్ ఐటీలలో గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఉన్నారు. వారికి ఒక్కసారిగా ఇంగ్లీష్ మీడియం కోర్సులు ఇబ్బందికరంగా ఉంటాయి. అందుకే వారికి రెండు నెలలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాం. కొన్ని సబ్జెక్టులు ఫెయిలైన వారికి రెమిడియల్ క్లాసులు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా యోగా, మెడిటేషన్, వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించి తర్ఫీదు ఇస్తున్నాం. మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించి ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నాం.

– ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఇడుపులపాయ

విద్యుత్ షాక్‌తో బర్రె మృతి



విద్యుత్ షాక్‌తో మరణించిన బర్రె

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం బాలుపల్లి నుంచి గోపులాపురం వెళ్లే దారిలో విద్యుత్ షాక్‌తో బర్రె మృతి చెందింది. బాలుపల్లి గ్రామానికి చెందిన బొమ్మేపల్లె నారాయణమ్మ పశువులను మేపుతుండగా రోడ్డు పక్కగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద బర్రెకు, నారాయణమ్మకు విద్యుత్ షాక్ తగిలింది. బర్రె మృతి చెందగా, నారాయణమ్మ స్వల్ప గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. సమీపంలోని గ్రామస్తులు స్పందించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా నారాయణమ్మను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన బర్రె సుమారు లక్ష రూపాయలు పైగా విలువ చేస్తుందని, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అంత్యక్రియలు చేసేందుకు ముందుకు రాని బంధువులు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మే ఐహెల్ప్‌యూ సభ్యులు

జమ్మలమడుగు : వేపరాల గ్రామానికి చెందిన చిమ్మని వెంకట రమణ(32) పెన్నానదిలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. మైలవరం నుంచి వస్తున్న నీటిని నిలుపుదల చేసి గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అంత్యక్రియలు చేసేందుకు బంధువులు ముందుకు రాకపోవడంతో పోలీసులు మే ఐహెల్ప్‌యు సంస్థ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్ హుస్సేన్‌కు ఫోన్ చేసి వివరించారు. దీంతో ఫౌండర్ లక్ష్మణ్‌రావు, సభ్యులతో కలిసి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రొద్దుటూరును జిల్లా కేంద్రం చేయాలి

12 మందితో జిల్లా సాధన సమితి ఏర్పాటు



సంఘీభావం తెలుపుతున్న ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జేఏసీ కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియలో ప్రొద్దుటూరును జిల్లా కేంద్రం చేయాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ డి.నాగదస్తగిరి రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రం చేసేందుకు ప్రొద్దుటూరుకు అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు నియోజకవర్గాలతో కలిపి జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జిల్లా కేంద్రాన్ని ప్రకటించే వరకు సాధన సమితి ఆధ్వర్యంలో నిరంతరం కార్యక్రమాలను చేపడతామన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరును జిల్లా కేంద్రం చేయాలనేది ఎన్నో ఏళ్లుగా ప్రజల ఆకాంక్ష అన్నారు. ప్రొద్దుటూరులో జిల్లా కోర్టుతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, జిల్లాకు సంబంధించి ఆదాయంలో సింహభాగం ప్రొద్దుటూరు నుంచే ఉందన్నారు. అయినా ప్రొద్దుటూరు కనీసం రెవెన్యూ డివిజన్‌కు కూడా నోచుకోలేదన్నారు. ప్రముఖ న్యాయవాది సీవీ సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి తక్కువ జనాభాతో మన్యం జిల్లాను, ఎక్కువ జనాభాతో నెల్లూరు జిల్లాను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రొద్దుటూరు పాలకేంద్రం పరిధిలో సుమారు 1000 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, జిల్లా కేంద్రం ప్రకటిస్తే ఇక్కడే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించవచ్చన్నారు. స్పందన సంస్థ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఎస్ఆర్ వెంకటజనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ త్రేతాయుగం నుంచి ప్రొద్దుటూరుకు ప్రాశస్త్యం ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మహాత్మాగాంధీ ప్రొద్దుటూరులో పర్యటించారన్నారు. 1915లో బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఏర్పడిందన్నారు. మన కన్నా చిన్నదైన రాయచోటిని జిల్లా కేంద్రం చేశారని, రాజంపేటను పార్లమెంట్ స్థానం చేశారని, త్వరలో మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయబోతున్నారన్నారు. 1970లోనే పరిశ్రమల కోసం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని క్యాబినెట్ సబ్ కమిటీకి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరును జిల్లాగా ప్రకటిస్తే వైద్య కళాశాల రావడంతోపాటు ప్రస్తుతం ఉన్న జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పడుతాయన్నారు. సమావేశంలో సభ్యులు భాస్కర్‌రావు, ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, అయూబ్ ఖాన్, నంద్యాల వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం ధన్నవాడ గ్రామంలో ఓ మైనర్ బాలికపై అత్యాచార యత్నం జరిగింది. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తలమంచిపట్నం ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసును విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



మృతి చెందిన బి. పుల్లారెడ్డి

కొండాపురం : మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భూమిరెడ్డి పుల్లారెడ్డి(72) అనే వృద్ధుడు మృతి చెందాడు. దత్తాపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా తాడిపత్రి వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొన్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన భూమిరెడ్డి పుల్లారెడ్డి తన మనవడు తేజేశ్వర్‌రెడ్డిని దత్తాపురంలోట్యూషన్ నుంచి ద్విచక్రవాహనంలో పిలుచుకొని వస్తుండగా ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమైందన్నారు. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. తేజేశ్వర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయని ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీ స్కోరు సాధించిన చిత్తూరు, నెల్లూరు జట్లు



161 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ తేజరెడ్డి



63 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్‌గౌడ్



52 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ శివ కేశవ రాయల్



182 నెల్లూరు బ్యాట్స్‌మన్ సోహన్ వర్మ



5 వికెట్లు తీసిన కర్నూల్ బౌలర్ అక్షిత్ రెడ్డి



3 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ నారాయణ

కడప వైఎస్సార్ సర్కిల్ : ఏసీఏ సౌత్ జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లలో చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు చేశాయి. ఆదివారం రెండవ రోజు కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు–కడప జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 137. ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 589 పరుగులకు డిక్లేర్డ్ చేసింది. ఆ జట్టులోని వై. తేజ రెడ్డి 162 బంతుల్లో 20 ఫోర్లు, 5 సిక్సర్లతో 161 పరుగులు చేశాడు. నిఖిత్ గౌడ్ 63 పరుగులు చేశాడు. కడప జట్టులోని చెన్నారెడ్డి 3 వికెట్లు, ఎస్ఎండీ అస్లమ్ 2 వికెట్లు, ధనుష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కడప జట్టు 32.4 ఓవర్లలో తొలి వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసింది. ఆ జట్టులోని శివ కేశవ రాయల్ 52 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 490 పరుగుల వెనుకంజలో ఉంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 374 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 96.4 ఓవర్లలో 514 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 220 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 182 పరుగులు చేశాడు. భార్గవ్ 75 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. సాయి ప్రణవ్ చంద్ర 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 41.5 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి గణేష్ 34 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని అఖిల్ 4 వికెట్లు, మాధవ్ 3 వికెట్లు, నారాయణ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 10 ఓవర్లకు వికెట్ కోల్పోకుండా 54 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 436 పరుగుల ఆధిక్యంలో ఉంది, దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

పోలీసు శాఖకు మీ సేవలు చిరస్మరణీయం

ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : క్రమశిక్షణ, అంకితభావంతో నాలుగు దశాబ్దాలపాటు నిర్విరామంగా పోలీసు శాఖకు సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్.పి ఈ.జి. అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఆగస్టు నెలాఖరున పదవీ విరమణ పొందిన ఎ.శివనాగేంద్ర కుమార్, ఎస్.ఐ, డి.సి.ఆర్.బి. కడప, ఎ.వి. రమణయ్య, ఎ.ఎస్.ఐ, కమలాపురం, బి.శ్రీనివాసులు, ఎ.ఆర్.హెచ్.సిలను ఆదివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సెల్ ఫోన్లు, కమ్యూనికేషన్ లేని రోజుల్లో కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించడం మామూలు విషయం కాదన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా, సమస్యలున్నా బాధ్యత అనేది పోలీస్ శాఖలో సమస్యలను అధిగమించేలా చేస్తుందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమతుల్యం చేసుకుంటూ పిల్లలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి. బి.రమణయ్య, ఏ.ఆర్ డి.ఎస్.పి. కె.శ్రీనివాసరావు, ఆర్.ఐ లు వీరేష్, టైటస్, డి.సి.ఆర్.బి. ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈ.సి. మెంబర్ ఏఫ్రిన్, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ వెటర్నరీ డిప్లొమా సందు తక్కువ ఫీజులో సీట్లు కలవు. 10th పాస్, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి అవకాశం కలదు. ✆ 83744 35245.

SERVICES
బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్ లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ (రిజిస్టర్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. ఫోన్: 7382114647

TAX CONSULTANCY
■ File Income Tax GST. Expert Help For Salaried, Business, Capital Gains, Company ITR, ROC Filings. Call:7207446677 To File Tax Returns.

WANTED
■ Wanted Qualified and Experienced English and Maths Teachers and Hostel Warden for a Reputed High school in Rayachoty. Attractive Salery for the Right PersonConduct 7093473533

■ Wanted Lady Doctor. Qualification; MBBS/BHMS/BAMS with 1-2 Years Experience in Gynaecology. Contact: Dr.S.Andal Bhaskar, Near S2 Cinema Theatres, Pogathota, Nellore. Ph: 99088 54316. 0861-2328914.

■ కష్టమైన్నా కాదు. VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు, ఫ్రీరూమ్+భోజనం. Hyd. 7993583999

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

5.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడం సంతృప్తికరం



గోపవరం శ్రీనివాసులురెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఇంజినీర్లు

కడప సిటీ : తన హయాంలో 5.50 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడం సంతృప్తికరంగా ఉందని వెలిగల్లు ఈఈ గోపవరం శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. ఆదివారం కడపలో ఆయన పదవీ విరమణ సందర్భంగా పనిచేసిన అనుభవాలను తెలిపారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన సేవలను తోటి ఇంజినీర్లు కొనియాడారు. వెలిగల్లు ప్రాజెక్టు సిబ్బంది, నీటిపారుదలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు, చేతి వృత్తిదారులకు ఇచ్చిన హామీలు అమలులో విఫలమైందని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగ సంఘ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన చేతివృత్తిదారుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలు, చేతివృత్తిదారుల కోసం కేటాయించిన రూ.47 వేల కోట్లు బీసీలు, చేతివృత్తిదారుల సంక్షేమానికి ఖర్చు చేయాలని, అలాగే చేతివృత్తిదారులకు ప్రభుత్వం చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. బీసీలు, వృత్తిదారులందరికి సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీలు మంత్రివర్గ సబ్ కమిటీలతోనే సరిపెట్టారని మండిపడ్డారు. అనంతరం చేతివృత్తిదారుల సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం




గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్: కడప రిమ్స్ సమీపంలో శిల్పారామం దగ్గర కల వారాహి హోటల్ వెనుక వైపున గుర్తు తెలియని వ్యక్తి (40) అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి

చాపాడు: వినాయకుడి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న మైదుకూరు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన నొస్సం సురేష్(39) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మండలంలోని అల్లాడుపల్లె ఆర్చి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరమ్మ కాలనీలో కొలువుదీరిన వినాయకుడి విగ్రహం నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా నొస్సం సురేష్ చాపాడు మండలంలోని కుందూనది వద్దకు వస్తుండగా అల్లాడుపల్లె క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదశాత్తు బైక్‌పై నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమైన సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి బాలుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్రీహరి

కమలాపురం : కమలాపురం పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన శ్రీహరి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రెడ్డీస్ కాలనీకి చెందిన నరసింహరావు కుమారుడు శ్రీహరి 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో చేయి తెగిపోవడంతో పాటు తలకు బలమైన గాయమై తీవ్ర రక్త స్రావం అయింది. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు విషయం తెలుసుకున్న కడప రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.